
ప్రజాశక్తి

సోమవారం 22 జూలై 2024

పార్వతీపురం మన్యం



మలేరియాతో గిరిజన బాలుడు మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



మండలంలోని వంగర గ్రామానికి చెందిన మన్నంగి గౌతమ్ (9) అనే గిరిజన బాలుడు మలేరియాతో మృతి చెందినట్లు తల్లిదండ్రులు తెలిపారు. రెండు రోజుల క్రితం బాలుడికి జ్వరం రావడంతో తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి రక్తపరీక్ష చేసి చికిత్స అందించామని, అనంతరం ఇంటికి తీసుకువచ్చామని తెలిపారు. ఆదివారం ఉదయం మృతి చెందినట్లు చెప్పారు. గౌతమ్ తన స్వగ్రామమైన ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుకున్నాడు.

అసౌకర్యాల నిలయం... గర్భిణుల వసతిగృహం



- మరమ్మతులకు గురైన మరుగుదొడ్లు
- పనిచేయని ఆర్‌ఓ ప్లాంట్
- ఏళ్ల తరబడి సిబ్బందికి జీతాలు కరువు

ప్రజాశక్తి - సాలూరు

సరిగ్గా ఆరేళ్ల క్రితం అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గిరి శిఖర గర్భిణుల వసతి గృహం ప్రస్తుతం అసౌకర్యాల నిలయంగా కనిపిస్తోంది. పట్టణంలోని గుమడాం వైటిసిలో ఈ వసతి గృహాన్ని అప్పటి ఐటిడిఎ పిఒ లక్ష్మీ షా ప్రారంభించారు. గిరి శిఖర గ్రామాల్లో గర్భిణులు వైద్యం కోసం కాలినడకన మైదానం ప్రాంతంలో ఉన్న ఆసుపత్రికి వచ్చే క్రమంలో మహిళ మార్గమధ్యలో ప్రసవించిన సంఘటన పై జాతీయ మానవహక్కుల కమిషన్ స్పందించింది. ఈ మేరకు పార్వతీపురం ఐటిడిఎ పిఒకు నోటీసు లు జారీ చేసిన నేపథ్యంలో అప్పటి పిఒ లక్ష్మీషా గుమడాం వైటిసిలో గిరిజన గర్భిణుల వసతి గృహాన్ని ప్రారంభించారు. గిరి శిఖర గ్రామాల్లో గల గర్భిణులను ఏడు, ఎనిమిది నెలల్లో ఈ వసతి గృహం లో చేర్పించి మెరుగైన వైద్యం, పౌష్టికాహారం అందించాలని నిర్ణయించారు. అప్పటి నుంచి పదుల సంఖ్యలో ఈ వసతి గృహంలో చేరుతున్నారు. వసతిగృహంలో ప్రసవించే వరకూ ఉంటూ సుఖంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బిడ్డలు పుట్టిన తర్వాత వారి సొంత గ్రామాలకు తరలిస్తారు. ఇలా అనేకమంది గిరిజన గర్భిణులు క్షేమంగా బిడ్డలతో ఇళ్లకు చేరుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ తరహా వసతిగృహాలను సాలూరు, గుమ్మలక్ష్మీపురంలో ప్రారంభించారు.

సిబ్బందికి జీతాలు లేని దుస్థితి

వైటిసిలో తొమ్మిది మంది సిబ్బంది పని చేస్తున్నారు. మేనేజరు, హౌస్ కీపింగ్ సిబ్బంది, గార్డెనర్లు, సెక్యూరిటీ గార్డులకు ఏళ్లతరబడి జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని నెలల జీతాల మంజూరు కోసం బిల్లు పెట్టినా సిఎఫ్ఎంఎస్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అంతే కాక గర్భిణుల వసతి గృహంలో పని చేస్తున్న ఎఎన్ఎంలకు కూడా సకాలంలో జీతాలందని పరిస్థితి కనిపిస్తోంది. అరకొర జీతాలు కూడా సకాలంలో అందకపోవడంతో వారు ఉద్యోగాలను వదులుకోలేక సక్రమంగా విధులు నిర్వహించలేక సతమతమవుతున్నారు.

మరమ్మతుకు నోచుకోని మరుగుదొడ్లు

గిరి శిఖర గర్భిణుల వసతి గృహంలో మరుగుదొడ్లు గత కొంతకాలంగా మరమ్మతు కు గురయ్యాయి. మరుగుదొడ్ల తలుపులు పోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో గర్భిణులు వైటిసిపై అంతస్తులో ఉన్న మరుగుదొడ్లను వినియోగించాల్సి వస్తోంది. పాడైన మరుగుదొడ్లను బాగు చేయాలని నిర్వాహకులు ఎన్నిసార్లు ఐటిడిఎ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. పై అంతస్తులో ఉన్న మరుగుదొడ్లకు వెళ్లి కిందకు దిగడం గర్భిణులకు ఇబ్బందిగా మారుతోంది.

పని చేయని ఆర్వో ప్లాంట్

గిరిజన గర్భిణుల స్త్రీల కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ఏడాదిగా పాడైపోయింది. దీంతో గర్భిణులకు రక్షిత మంచినీటి సరఫరా కరువైంది. మరమ్మతులు చేయాలని ఐటిడిఎకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాల్లేవు.



మరమ్మతులకు గురైన మరుగుదొడ్లు

ఆరేళ్ల యినా బడ్జెట్ కేటాయింపుల్లేవు

ఈ వసతిగృహాలు ప్రారంభించి ఆరేళ్లయినా బడ్జెట్ కేటాయింపుల్లేకపోవడంతో ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారం కాని పరిస్థితి ఏర్పడింది. ఈ వసతిగృహాలు ప్రారంభం నాటికి ఐటిడిఎకు నిధులు పుష్కలంగా ఉండడంతో ఏర్పాటు చేశారు. ఈ వసతిగృహాల ఏర్పాటుపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. నిరుపేదలైన గిరి శిఖర గర్భిణులకు వసతి గృహం లో మెరుగైన వైద్యం, పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశాన్ని ప్రముఖులు ప్రశంసించారు. అప్పటి రాష్ట్ర గవర్నర్ హరిచందన్ విశ్వరూప్ కూడా వసతి గృహాన్ని సందర్శించి కితాబిచ్చారు. ఇంతటి గొప్ప ప్రాజెక్టుకు నిధులు లేకపోవడంతో నీరసించే పోయే పరిస్థితి దాపురించింది. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత ఐటిడిఎలో ఉన్న నిధులను అప్పటి జిల్లా కలెక్టర్ నిశాంత్ కలెక్టరేట్ నిర్వహణకు ఖర్చు చేయడంతో ఐటిడిఎ ఉట్టి పోయింది. దీంతో గిరి శిఖర గర్భిణుల వసతిగృహాల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

సమస్యల్ని అధికారులకు చెప్పాం

గిరి శిఖర గర్భిణుల వసతి గృహంలో సమస్యలపై ఐటిడిఎ అధికారులకు వివరించాం. మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్ పాడయ్యాయి. మరమ్మతులు చేయాలని ప్రతిపాదనలు పంపించాం.

- విద్యాసాగర్, మేనేజర్,వైటిసి

వర్షాల నేపథ్యంలో జిల్లాలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - పాలకొండ



ఏరియా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ క్షేత్ర స్థాయిలో ఆదివారం పర్యటించారు. ఆదివారం పాలకొండ డివిజన్ పరిధిలో నాగావళి నది ప్రవాహాన్ని పరిశీలించారు. వర్షాలు అధికంగా కురిస్తే వివిధ రకాల వ్యాధులు భారిన ప్రజలు పడే అవకాశాలు ఉండడంతో ఆసుపత్రుల్లో సేవలు పరిస్థితిని పరిశీలించారు. నాగావళిలో ప్రవాహం సాధారణ స్థాయిలో ఉందని, అయితే ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైతే ప్రజలను అప్రమత్తం చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కాలానుగుణంగా వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్న దృష్ట్యా వైద్య విభాగం పూర్తి సామర్థ్యంతో పనిచేయాలని అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రి, అన్నవరం పిహెచ్‌సిని తనిఖీ చేసి వైద్యులు, చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవలు పట్ల ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మంచి వైద్య సేవలందించాలన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు పడకలు సాధ్యమైనంత మేర ఏర్పాటు చేయాలని, మందులు సిద్ధంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో వైద్య సేవలందించాలని సూచించారు. ఆసుపత్రి ప్రసవాలు జరగాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పరికరాలు అన్ని అందుబాటులో ఉన్నాయని, వైద్య నిపుణులు ఉన్నారని వారి సేవలతో ప్రసవాలు పెంచాలని అన్నారు. ఇతర ఆసుపత్రులకు రిఫరల్ కేసులు తగ్గించాలని సూచించారు. ఏరియా ఆసుపత్రిపై ఎక్కువ భారం పడకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య సేవలు బలోపేతం చేయాలని, మంచి సేవలందించడం వల్ల ఇది సాధ్యపడుతుందని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా ఆహార నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ వి.వెంకటరమణ, ప్రోగ్రాం అధికారి ఎం వినోద్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలుగా మాధవన్, రాహుల్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్



మాధవన్



రాహుల్

స్థానిక ఐటిడిఎ పిఒ సేదు మాధవన్‌ను, సీతంపేట ఐటిడిఎ పిఒగా రాహుల్ కుమార్ రెడ్డి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మాధవన్ ఇక్కడికి పిఒగా రానున్నారు. అలాగే ఇక్కడ పిఒగా పనిచేసిన సి.విష్ణుచరణ్ నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. అలాగే నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి బదిలీపై సీతంపేట ఐటిడిఎ పిఒగా రానున్నారు. అలాగే గతంలో మన్యం జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన నిశాంత్‌కుమార్‌కు ఎక్సైజ్, ప్రొహిబిషన్‌శాఖ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న రోగులు

విజృంభిస్తున్న విష జ్వరాలు

పదుల సంఖ్యలో జ్వరపీడితులు

దాలమ్మ కోనేరే కారణమంటున్న స్థానికులు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగి దళితవాడలో గత కొన్ని రోజులుగా జ్వర పీడితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. దీంతో ఇటీవల జియ్యమ్మవలస పిహెచ్‌సి వైద్యాధికారి దళితవాడలో మెడికల్ క్యాంప్ నిర్వహించడమే కాకుండా, అక్కడ యువతతో వీధి కాలువలను శుభ్రపరచే కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పారిశుధ్య పనులు కూడా చేపట్టారు. అయినప్పటికీ ఒక్కసారిగా జ్వర పీడితుల పెరుగుతున్నారు. గ్రామానికి చెందిన మీసాలు చంటి, రాంబాబు, సంపత్, వెంకటమ్మ, వెలగాడ కీర్తి, జలుమూరు చిట్టి రాణి, భారతి, కావ్య, శారద, ఎస్.సూర్య, పి.శాంతమ్మ, బి.రత్నం, బి.సుందరమ్మ, సావిత్రమ్మ, రాజేశ్వరరావు, ఎస్.స్వర్ణలత, బి.ప్రవీణ్, బి.పవన్ వీరంతా తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. మరి కొంతమందిని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అంతే కాకుండా విజయనగరం, విశాఖపట్నం ప్రైవేట్ ఆస్పత్రుల్లో మీసాల బుల్లి బాబు, బొమ్మాల అనిల్, బొమ్మాల హరీష, ఎస్.వీరయ్య, సిరిపురం రవి చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై వైద్యాధికారులు ఎప్పటికప్పుడు జ్వరపీడుతులకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నప్పటికీ దీనికి ప్రధాన కారణమైన దళితవాడకు పక్కనే ఉన్న దాలమ్మ కోనేరే కారణమని స్థానికులు అంటున్నారు. ఈ చెరువు గత కొన్నేళ్లుగా నీరు నిల్వ ఉండడం, దోమలు, క్రిమి కీటకాలు విపరీతంగా ప్రబలేందుకు కారణమవుతుందని వారు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని దళితవాడ ప్రజలు కోరుతున్నారు.


జాలు వారని జైకా నిధులు

రూ 63.5 కోట్లు మంజూరు చేస్తామన్నా నేటికీ విడుదల చేయని వైనం

వర్షాలతోనే సగం ఆయకట్టు ఉబాలు

ప్రజాశక్తి- మక్కువ

నిధులు బారెడు.. పనులు జానెడు అన్న చందంగా వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో 20 శాతం మేరకే పనులు పూర్తి చేసి నిలిపివేసే పరిస్థితి ఏర్పడింది. వెంగళరాయ ప్రాజెక్ట్ ద్వారా మూడు మండలాలకు సంబంధించి సుమారు 24,700 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. కొన్నేళ్లుగా వెంగళరాయ సాగర్ కాలువల దుస్థితి అధ్వానంగా మారింది. నదిపై ఆక్విడ్ కూలిపోవడంతో ఎల్‌బిసి ఆయకట్టుకు నీరందని దుస్థితి ఇప్పటికీ కొనసాగుతుంది. గత ప్రభుత్వం ప్రాజెక్టు అభివృద్ధి కోసం జపాన్ ఆర్థిక సహాయంతో రూ.63.5 కోట్లు నిధులతో ఆధునీకరించాలని నిశ్చయించింది. ఈ మేరకు ఆర్‌ఎంసిలోనూ, ప్రాజెక్టులోని హెడ్ వర్క్స్ లూయిస్ లీకేజీ వాటర్ నివారణ తదితర పనులు దాదాపుగా 20 శాతం మేర పూర్తి చేశారు. కానీ నిధులు విడుదల చేయలేదు. ప్రధాన కాలువలకు సంబంధించి ఉపకాలువలలో పూడిక పేరుకు పోయి సాగునీరు భూములకు అందని పరిస్థితి ఏర్పడింది. ఆర్‌ఎంసి పరిధిలోని 12ఎల్ కాలువ పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. అలాగే ఎల్‌బిసి పరిధిలోని కాదాంబరి గెడ్డ వద్ద సైపాన్ పూర్తిగా దెబ్బ తినడంతో మార్కొండపుట్టి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు 30 ఏళ్లుగా సాగునీరందని దుస్థితి నెలకొంది. జైకా నిధులతోనైనా ఈ పరిస్థితులు మారుతాయేమోనని రైతులంతా ఎదురు చూశారు. కానీ ఆ పనులు కూడా పూర్తిస్థాయి కాకపోవడంతో వారంతా ఈ ఏడాది నిరాశతో సేద్యం చేయాల్సిన పరిస్థితి. అలాగే ఆర్‌బిసి పరిధిలోని 13 ఎల్ కాల్వ పరిధిలో ఉన్న కోన గోపాలపురం ఆయకట్టు భూములకు సాగునీరందడం గగనంగా మారింది. కాలువలు ఉన్నప్పటికీ వర్షంపైనే ఆధారపడాల్సిన దుస్థితి అక్కడ రైతులకు ఏర్పడింది.



వర్షాలతోనే సగం ఆయకట్టులో వరి నాట్లు..

ఈ ఏడాది మే, జూన్‌లో కురిసిన వర్షాలకు చెరువులు నిండికుండలుగా దర్శనం ఇవ్వడంతో వెంగళరాయ ఆయకట్టు పరిధిలోని చెముడు, చప్పబుచ్చంపేట, వెంకంపేట, కన్నంపేట పంచాయతీలకు సంబంధించిన భూముల్లో వరినాట్లు పూర్తిగా పడ్డాయి. వర్షం నీటితో పాటు విఆర్ఎస్ ఆర్ఎంసి కాల్వ లీకేజీ వాటర్ కూడా ఇక్కడ భూముల వరి నాట్లకు ఆస్కారం కలిగించింది.

నిధులు రాకపోయినా నీరందిస్తాం

గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సుమారు రూ.10 కోట్లు మేర నిధులు రావాల్సి ఉంది. అయితే ప్రస్తుత ఖరీఫ్‌కు ఆయకట్టు రైతులకు నీరందించాలనే ఉద్దేశంతో ఆయా కాలువల్లో పూడిక తీతలు కూడా చేపడుతున్నాం. ప్రస్తుతం ఏ విధమైన నిధులు రాలేదు. చిన్నపాటి పనులు కాంట్రాక్టర్లను ఒప్పించి చేపడుతున్నాం. ఆగస్టులో నీటిని విడుదల చేసేందుకు సన్నాహం చేస్తున్నాం.

-శ్రీనివాస రావు, ఎఇఇ, విఆర్ఎస్

30 ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం

విఆర్ఎస్ ప్రాజెక్టు నుంచి సాగునీటి కోసం సుమారుగా 30 ఏళ్లుగా నిరీక్షిస్తున్నాం. కదాంబరిగెడ్డ వద్ద ఏర్పాటు చేసిన స్లూయిస్ చెడిపోవడంతో చుక్క నీరు కూడా భూములకు రావడం లేదు. ఏడాదైనా ఆ పనులు పూర్తి చేసి సాగునీరందిస్తారేమోనని రైతులంతా ఎదురు చూశాం. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో వర్షంపైనే ఆధారపడి ప్రతి ఏటా రైతులు నష్టపోతున్నారు ప్రభుత్వం 10-ఆర్ పరిధిలోని రైతులకు సాగునీరందించి ఆదుకోవాలి.

- వెంపటాపు శ్రీహరి నాయుడు, రైతు, గైశీల.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందక

ఆర్‌ఎంపిలను ఆశ్రయిస్తున్న గిరిజనులు

ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ప్రభుత్వం సరైన వైద్య సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆర్‌ఎంపి వైద్యులను ఆశ్రయించి ప్రాణాలు కోల్పోతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, కోశాధికారి మండంగి రమణ, జిల్లా నాయకులు మండంగి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో సరైన వైద్య సౌకర్యాలు అందకపోవడంలేదని, సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా, డయేరియా, డెంగీ వ్యాధుల నివారణకు మందులు అందుబాటులో లేకపోవడంతో పెద్ద ఎత్తున గిరిజనులు ఆర్‌ఎంపి వైద్యులను ఆశ్రయిస్తున్నారన్నారు. వీరు అవసరానికి మించి వైద్యం చేస్తున్నారన్నారు. దీనివల్ల ఒక్కొక్కసారి వైద్యం వికటించి రోగులు చనిపోతున్నారని అన్నారు. కురుపాం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 30 పడకల ఆసుపత్రి ఉండగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వచ్చిన గిరిజనులను అటు కొమరాడ మండలం మాదలింగి ఇటు రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గిరిజనులను వెళ్లమని అధికారులు చెబుతున్నారని, ఇది దుర్మార్గమని అన్నారు. కురుపాం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వంద పడకల ఆసుపత్రిగా మార్చి ఏరియా హాస్పిటల్ చేయాలని అనేక ఏళ్లుగా ఆదివాసీ గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా వైద్య, ఆరోగ్య సిబ్బంది, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలు స్పందించి మన్యం జిల్లాలో వైద్య సేవలు మెరుగుపరచాలని కోరారు. లేనిపక్షంలో గిరిజన సంఘం, సిపిఎం తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో గిరిజన సంఘం నాయకులు అవినాష్, రమణ

ఆశ పెట్టి... ఉసూరుమనిపించి

ప్రజాశక్తి - కొమరాడ

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి మొన్నటి వరకూ ఆకాశం వైపు ఆశగా వర్షం కోసం ఎదురుచూసిన రైతన్నకు తుపాన్ కబురు అందించినప్పటికీ జంఝావతి ప్రాజెక్టు అధికారులు మాత్రం ఆశపెట్టి రైతులను ఉసురు మానిపించారు. పది రోజుల క్రితం జలాశయం ఎడమ కాలువ ద్వారా రైతులకు సాగునీరు అంతంతమాత్రంగా విడిచిపెట్టారు. దీంతో కాలువ ఆయకట్టు పరిధిలో ఉన్న రైతులు ఖరీఫ్ సీజన్ దమ్ములకు సిద్ధమయ్యారు. మరోవైపు ఇటీవల వర్షాలు కురవకపోవడంతో ఆకు పెరగాక రైతులు వర్షాల కోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. ఇంతలోనే గత నాలుగు రోజులుగా బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో అంతంతమాత్రంగా వర్షాలు కురిసాయి. అయితే కొమరాడ మండలంలో ఓ మోతాదులో కురిసిన వర్షాలు కొంతమేరకు రైతులకు ఉపయోగపడ్డాయి. ఇంతలోనే దమ్ములకు సన్నద్ధమైన సమయంలో రెండు రోజుల క్రితం జంఝావతి కాలువ ద్వారా వస్తున్న నీటిని అధికారులు నిలిపివేశారు. దీంతో దమ్ములకు సిద్ధమైన రైతన్నలు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఇటీవల తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురిసిన స్వల్ప వర్షాలకు ఆకుమడులకు ఉపయోగం తప్ప దమ్ములు పట్టేందుకు పొలాల్లో ఎటువంటి నీరు చేరలేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ ద్వారా వస్తున్న నీటిని ఉపయోగించుకొని దమ్ములు పట్టేందుకు సిద్ధమైన రైతన్నలు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు పడినట్టుగా నీరు అవసరం లేనట్టు అధికారులు కాలువ నీరు ఎందుకు ఆపారో తెలియని పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు. కనీసం ఒక్క పొలం మడిలో కూడా నీరు చుక్క కూడా లేదని, దమ్ములకు సిద్ధమైన సమయంలో కాలువ నీరు నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున తక్షణమే జంఝావతి ప్రాజెక్టు అధికారుల స్పందించి కాలువ ద్వారా తక్షణమే సాగునీటిని పూర్తిస్థాయిలో అందించి ఖరీఫ్ సాగుకు సహకరించాలని రైతులు కోరుతున్నారు.

తుపాను పేరుతో కాలువ నీరు విడుదలకు ఎగనామం



దళిత, భూ సమస్యలపై

29న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గరుగుబిల్లి మండలం శివ్వాం దళితులపై దాడిచేసిన, దూషించిన పెత్తందారులను అరెస్ట్ చేయాలని, జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ బీసీ పేదల భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని కెవిపిఎస్ నాయకులు రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని పెద్ద బొండపల్లిలో గిరిజన సంఘం, కెవిపిఎస్ నాయకులు, టి కృష్ణ, పి త్రినాధ వెంకన్న, బోడెమ్మ, రాముడమ్మ, దూళికేశ్వరరావు ఆధ్వర్యంలో కరపత్రాలు, పోస్టర్లతో ప్రచారం వీధివీధిన సమావేశాలు ఆదివారం నిర్వహించారు. అనంతరం రెడ్డి వేణు మాట్లాడుతూ శివ్వాంలోని దళితులపై పెత్తందారులు చేసిన దాడిని ఖండించారు. ఆ గ్రామంలో కూడా సర్వేనెంబర్ 58 /19 లో 8 ఎకరాలు గిరిజనులకు పట్టాలు ఇచ్చినా సర్వే చేసి భూమిని చూపించకుండా రహదారి పేరుతో పెత్తందారులు ఆక్రమించారని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కొమరాడ : పెండింగ్ భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివుని నాయుడు, సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను స్థానిక జూనియర్ కాలేజ్ సెంటర్, గుమడ సంతలో ఆదివారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో గల ఎస్సీ, ఎస్టీ, పేదలు సాగు చేస్తున్న భూములు గాను పట్టాలి ఇచ్చి అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎ.ఉపేంద్ర, హెచ్ లక్ష్మం,రాములు, రాము, వెంకటేష్, సుబ్బారావు, రామారావు పాల్గొన్నారు.



కొమరాడలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సాలూరు: శివ్వాంలో దళితుల పై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి నాయకులు జె.హరిబాబు, టి.విజయ్,టి.లక్ష్మీ కోరారు. దీనికి నిరసనగా ఈనెల 29న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు గోడ పత్రికలను విడుదల చేశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ లు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కూడా ఎన్వై నాయుడు పాల్గొన్నారు.

క్వారీని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సూరంపేట వద్ద నిర్వహిస్తున్న క్వారీని మైనింగ్ అధికారులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదివారం పరిశీలించారు. క్వారీకి ఎటువంటి అనుమతుల్లే కుండా నడవడంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కాలుష్య ఇబ్బంది ఉన్నట్లు గుర్తించారు. ప్రజల సంక్షేమం, ఆరోగ్యం ప్రధానమని, అనుమతుల్లేని క్వారీలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి క్వారీ నిబంధన మేరకు నడపాలని, చుట్టుపక్కల ప్రజల ఆరోగ్య సమస్యలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర


బీమా చెక్కును అందజేస్తున్న నాగబాబు

రూ.5 లక్షల బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో ఇటీవలే పెద్దకాపు వీధికి చెందిన జనసేన పార్టీకి చెందిన క్రియాశీలక సభ్యులు దుప్పాడ కుమారి ప్రమాదవశాత్తు మరణించడంతో ఆ కుటుంబానికి ఆదివారం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర పిఎసి చైర్మన్ కొణిదెల నాగబాబు చేతుల మీదుగా రూ.5 లక్షల బీమా చెక్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గర్భాన సత్తిబాబు, నాయకులు గులివెందుల లక్ష్మణ, జిల్లా సంయుక్త కార్యదర్శి జాని, సంతోష్, తదితరులు ఉన్నారు.

తాబేలువలసకు రోడ్డు సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్ పంచాయతీ తాబేలువలసకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆదివారం ఆ గ్రామ గిరిజనులు ప్రస్తుతం మట్టి రహదారి వెంట నడుచుకుంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోర్జిపాడు గ్రామ బిటి రోడ్డు నుంచి తమ గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్లు పూర్తిగా మట్టి రహదారి ఉందని, ఇంతవరకు ఏ ప్రభుత్వం రహదారి మంజూరు చేయించలేదని వాపోయారు. దీంతో వర్షాలు పడిన సమయంలో చాలా కష్టమవుతుందన్నారు. ఏ చిన్న అవసరం వచ్చినా మొండెంఖల్‌కు ఈ దారి వెంటే వెళ్తున్నామన్నారు. అత్యవసర సమయంలో కనీసం 108 వాహనం కూడా వచ్చే పరిస్థితి లేక కాలినడక డోలీ మోతతో రోగిని తీసుకెళ్లాల్సి వస్తుంది. కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నామన్నారు.


బురదమైన రోడ్డుపై నడుచుకుంటూ నిరసన తెలుపుతున్న తాబేలవలస గిరిజనులు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యాన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని గ్రామాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దరఖాస్తులను ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. అన్ని శాఖల జిల్లా, నియోజకవర్గ అధికారులు ఈ కార్యక్రమంలో అందుబాటులో వుంటారు.

గిరిజన రైతులకు జీడి మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కొటికిపెంట పంచాయతీ గరేళ్ళవలస, ఒలిసిలమడ గిరిజన గ్రామాలకు 20 మంది గిరిజన రైతులకు ఉపాధి హామీ చట్టం ద్వారా వచ్చిన మొక్కలు అందజేశారు. ఒక్కొక్క రైతుకు 70 జీడి మొక్కలు చొప్పున సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యులు సత్యవతి పంపిణీ చేశారు


బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పద్మాపురం గ్రామానికి చెందిన గిరిజన మహిళ కురిడి జోగమ్మ ఇల్లు గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు కూలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న జనసేన, టిడిపి నాయకులు ఆదివారం పద్మాపురం వెళ్లి నష్టపోయిన బాధిత కుటుంబానికి బియ్యం, పప్పు, నూనె, కూరగాయలు, నిత్యవసర సరుకులతో పాటు కొంత మొత్తం నగదు అందజేశారు. కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు గొర్లె జగదీశ్వరరావు, టిడిపి నాయకులు పూసర్ల నర్సింగరావు, ఎంపీటీసీ సభ్యులు పల్లేడ ఉమామహేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్య పీఠంలో వ్యాసపాదుకార్చనలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో గల శ్రీ సూర్య పీఠంలో ఆదివారం వ్యాస భగవానుని పాదుకార్చనలు, భాస్కరానందతీర్థ పాదుకార్చనలు అశేషశేముషీనిధి బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా 2వ అడిషనల్ జడ్జి దామోదరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గురుపాదుకార్చన అనంతరం గురు మంత్ర హెూమం భగవద్గీతా శ్లోక మంత్ర హవనం, విశ్వ శాంతి హెూమాలు, శ్రీ గురు దత్తాత్రేయ దక్షిణామూర్తి పాదుకలకు క్షీరాభిషేకం నిర్వహించారు. దీక్షాపరులైన భక్తులకు పూర్ణాహుతి అనంతరం యజ్ఞ ప్రసాదం అందించారు. కార్యక్రమంలో వి.వివేకానంద, డి.ఉమా శర్మ, హర్ష శర్మ, ఆర్‌కె శర్మ వైదిక సహకారం అందించారు..


పూజలు ప్రారంభిస్తున్న జిల్లా రెండో అడిషనల్ జడ్జి దామోదరరావు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని అనేక మండలాల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ప్రయాణికులు, పాదాచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అసలే గోతులమయమై ఉన్నాయి. అందులోనూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరడంతో ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఆఖరుకు భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అవస్థలుపడుతున్నారు. కొత్త ప్రభుత్వమైన రోడ్ల మరమ్మతులకు మోక్షం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు ప్రాంతంలో ఉన్న అంతర్ రాష్ట్ర రహదారిని చూస్తే చాలా దారుణంగా ఉంది. రాయగడ వెళ్లే రహదారి కూనేరు వరకు పరమ అధ్వానంగా మారింది. గోతుల్లో వాహనాలు దిగి మరమ్మతులకు గురై నిలిచిపోతున్నారు. దీంతో నిత్యం భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి.

- కొమరాడ



ఇది మండలంలోని ఎర్రన్న గుడి జంక్షన్ వద్ద, తోటపల్లి కుడి ప్రధాన కాలువ వద్ద పార్వతీపురం నుంచి కురుపాంకు వెళ్లే రోడ్డు దుస్థితి. గతంలో ఈ రోడ్డును తూతూ మంత్రంగా మరమ్మతులు చేయడం తప్ప శాశ్వత పరిష్కారం చేయక పోవడంతో ఎప్పటికప్పుడు శిథిలావస్థకు చేరుతున్నాయి. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

-గరుగుబిల్లి



మండలంలోని గుడివాడ రహదారి ఇది. వర్షం పడితే ఈ రోడ్డుపై ప్రయాణం నరకం గుడివాడ నుండి ఓనిమీదుగా పాలకొండ వరకు సుమారు 6కిలో మీటర్ల మట్టి రోడ్డు ఉంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో ఆ రోడ్డుపై నడవాలంటే అవస్థలు పడాల్సిందే.

-పాలకొండ





ఈ రహదారి అంటివలసకు వెళ్లే రోడ్డు. ఏళ్లతరబడి ఈ రహదారి నిర్మాణం జరగకపోవడంతో వాహనదారుల కు ఇక్కట్లు తప్పడం లేదు. మామిడిపిల్లి నుంచి అంటివలస మీదుగా బాగువలసకు వెళ్లే వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలు పడినప్పుడల్లా గోతులు పెద్దవి కావటంతో తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారి పూర్తిగా చిందరవందరగా ఉంది.

- సాలూరు

నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తం

ప్రజాశక్తి కొమరాడ

నాగావల్లి నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శోభిక అన్నారు. నాగావళి నదీ పరివాహక ప్రాంతాలైన పాతకల్లి కోటను ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా నాగావళి నది ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశముందన్నారు. కావున నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు సచివాలయ సిబ్బంది ద్వారా ఆయా గ్రామాల్లో దండారో వేయించారు. ఎప్పుడూ నదిలో నీటి ప్రవాహం పెరుగుతుందో తెలియదు కాబట్టి ప్రజలు మరింత అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. జెసి వెంట మల్లికార్జునరావు, మండల పరిషత్ కార్యాలయ ఎఒ రమేష్, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, ఆర్ఐ శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రెటరీ నరేష్, వీఆర్వో సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సీతానగరం : మండలంలోని కొత్తవలస, పెదంకలాం నదీ పరివాహక ప్రాంతాలను స్థానిక తహశీల్దార్ ఇ.శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల తర్వాత గోతులను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆర్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, విఆర్ఒ పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : మండలంలోని ముంపు గ్రామమైన బాసంగి వద్ద తహశీల్దార్ సీతారామయ్య హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో నదీ పరివాహక ప్రాంతమైన బాసంగి ముంపుకు గురికావడం జరుగుతుందని, దీనిపై ప్రజలంతా అప్రమత్తం కావాలని హెచ్చరించారు.

భామిని : మండలంలోని వంశధార నది తీర ప్రాంత గ్రామాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులను తహశీల్దార్ బి.శ్రీనివాసరావు ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా ఒడిశాలో కురిసిన వర్షాలు వంశధార నది నీటి మట్టం పెరిగిందని, గ్రామస్తులు నదిలోకి ఎవరూ వెళ్లొద్దని సూచించారు. కార్యక్రమం లో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ శోభిక

వీరఘట్టం: మండలంలోని కడకల్లా, చిట్టి పూడి వలస, కిమ్మీ, గడగమ్మ , పివిఆర్ పురం, బిటవాడ, ఎం.వి. పురం, పనస నందివాడ, నది తీర ప్రాంతాలను తహశీల్దార్ కె.జయప్రకాష్, ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం పరిశీలించారు. వీరి వెంట విఆర్‌ఒలు, గ్రామస్తులు ఉన్నారు.

పార్వతీపురం రూరల్ : భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందన స్థానిక తహసీల్దార్ మండలంలోని అడ్డాపుశిల, గోపాలపురం శివారులలోని ముంపు ప్రాంతాలను పరిశీలించారు. నాగావళి వరద నీటి మట్టం పెరిగితే దాని ప్రభావం వల్ల ముంపుకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక వీఆర్వోలను ఆదేశించారు.

నేటి నుంచి శిక్షా సప్తాహ్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సోమవారం నుంచి శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంఇఒ ఎన్.నాగభూషణరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి) 2020 ప్రవేశపెట్టి 4వ వార్షికోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని నిర్వహించాలని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఆదేశాల జారీ చేసినట్లు తెలిపారు. జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలపై, దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధతను తెలియజేసే దిశగా ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు భాగస్వామ్యం కావాలని కోరారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందర్శించారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు పార్కును సందర్శించారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. చిన్నారులు మినీ ట్రైన్ బోటింగ్ చేశారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. మరి కొంతమంది ఫైవ్ డి థియేటర్లను వీక్షించారు. అనంతరం ఆడలియూ పాయింట్ సందర్శించి మైమరిపించే ప్రకృతి అందాలను ఆశ్వాదించారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి జరగాలాడారు.



ములగలో నాట్లు వేస్తున్న మహిళా రైతులు

ప్రారంభమైన ఉబాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

వారం రోజులుగా వాతావరణ పరిస్థితుల్లో ఏర్పడిన మార్పులు సందర్భంగా కురిసిన వానాలతో పొలాల్లోకి నీరు చేరడంతో, ఇప్పటికే నారుమళ్ల అంది రావడంతో మండలంలో రైతులు ఉడుపులకు సిద్ధమవుతున్నారు. మండలంలోని ములగ, డోకిసిల, జమదాల పంచాయతీ పరిధిలో ఆదివారం ఉభాలు ప్రారంభమైనట్లు మండల వ్యవసాయ అధికారి అశోక్ తెలియజేశారు. వెంకంపేట, చిన్నబొండపల్లి, నరిసిపురం తదితర ప్రాంతాల్లో ఆశాజనకంగా చెరువులు నిండకపోయినప్పటికీ పొలాల్లో నీరు చేరడం వల్ల రైతులు నాట్లు వేసుకోవడానికి సిద్ధమవుతున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఈ ఏడాది రైతులు వెదజల్లే పద్ధతిలో సాగు చేయడం వల్ల ఈ వర్షాలు వాటికి ఎంతగానో ఉపయోగపడ్డాయని తెలిపారు. రైతులు నాట్లు వేసుకునే ముందు నారును కార్బన్డైజమ్ కలిపిన నీటిలో వేర్లను ముంచి నాటుకుంటే తెగుళ్లను నిరోధించవచ్చని తెలిపారు.

ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

ప్రతి ఏటా ఆగస్టు 9న నిర్వహించే ఆదివాసీ దినోత్సవ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని గిరిజన సంఘాల నాయకులు సహకరించాలని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక వైటిసిలో అన్ని గిరిజన సంఘాల సంఘాల నాయకులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకునేందుకు ఆదివాసీ ఉత్సవాల పండగ ఒక వేదిక కావాలన్నారు. ఇప్పటికే ఆదివాసీలకున్న హక్కులు, చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క గిరిజనుడిపై ఉందన్నారు. ఆదివాసీల జీవనం విధానం, కళలు ప్రతిభంబించేలా ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం కోశాధికారి మండంగి రమణ, నాయకులు మండంగి భూషణ, కద్రక మల్లేశ్వరరావు, నందివాడ కృష్ణబాబు, కద్రక కళావతి, వెంపటాపు భారతి, బిడ్డిక పద్మావతి, యుటిఎఫ్ మండల కార్యదర్శి పత్తిక శంకర్రావు, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్, ట్రైబల్ రైట్ ఫోరం అధ్యక్షులు రొబ్బ లోవరాజు పలు గిరిజన సంఘాల నాయకులు ఉన్నారు.


చిదిమి గ్రామ జంక్షన్ మలుపు వద్ద రహదారి అడ్డంగా నిలిచిపోయిన లారీ

తప్పిన పెను ప్రమాదం

ఊపిరి పీల్చుకున్న ప్రజలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రానికి సమీపాన గల చిదిమి జంక్షన్ ప్రధాన మలుపు వద్ద గల రైలింగును పాలకొండ నుండి వస్తున్న లారీ ఢీకొని రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. పక్కనే ఉన్న తోటపల్లి కాలువలో పడకుండా తృటిలో తప్పిపోవడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రహదారిపై లారీ అడ్డంగా ఉండిపోవడంతో వాహన రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని చేరుకొని రహదారి అడ్డంగా ఉన్న లారీని జెసిబి ద్వారా పక్కకు నెట్టి వేయడంతో కొంతమేర ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది.

మొద్దు నిద్రలో ఆర్ అండ్ బి అధికారులు

చిదిమి జంక్షన్ ప్రధాన మలుపు వద్ద రహదారికి ఇరువైపుల మొక్కలు ఉండడం వల్ల ఈ మలుపు దగ్గరికి వచ్చేసరికి వాహనాలను అదుపు చేయలేకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఇదే మలుపు వద్ద పాలకొండ నుండి రాయగడకు వెళ్లే బొగ్గుల లారీ , శీతల పాల కేంద్రాలకు తరలించే లారీ రోడ్డుకు అడ్డంగా బోల్తాపడ్డాయి. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. నిత్యం ఇలా జరుగుతున్నా రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించడంలో ఆర్అండ్‌బి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ ప్రాంతంలో నిత్యం ప్రమాదాల సంభవిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఆర్అండ్‌బి అధికారులు రహదారికి ఇరువైపులు ఉన్న చెట్లు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే మాధవిని కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - మక్కువ

నెల్లిమర్ల ఎమ్మెల్యే, విజయనగరం జిల్లా జనసేన పార్టీ కోఆర్డినేటర్ లోకం మాధవిని సాలూరు నియోజకవర్గం జనసేన సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ ఆదివారం కలిశారు. ఈ ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలు, జనసేన విస్తరణ తదితర అంశంపై చర్చించామన్నారు. నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారని తెలిపారు. పార్టీ కోసం పనిచేయాలని, కష్టపడిన ప్రతి ఒక్కరికీ గౌరవం దక్కుతుందని ఎమ్మెల్యే అన్నారని ఆయన తెలియజేశారు.



ఎమ్మెల్యే మాధవిని కలిసిన జనసేన నాయకులు రిషివర్ధన్

బైక్ ఢీకొని బాలికకు గాయాలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

బైకు ఢీకొని మండలంలోని వెంకంపేటకు చెందిన బొత్స మోక్షశ్రీకి గాయాలయ్యాయి. ఆదివారం సాయంత్రం ఏడో తరగతి చదువుతున్న మోక్షశ్రీ చినబొండపల్లిలో ట్యూషన్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా పార్వతీపురం నుండి ఎంఆర్ నగరం ద్విచక్ర వాహనంపై వెళుతున్న వెంకటరమణ యువకుడు బైకును అజాగ్రత్తగా నడపడంతో ఎదురుగా వస్తున్న బాలికను ఢీకొన్నాడు. దీంతో రహదారిపై పడిపోవడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

24న వాహనాల వేలం

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 24న కురుపాం ఎస్ఇబి కార్యాలయం వద్ద వాహనాలు వేలం వేస్తున్నట్టు ఎస్ఇబి సిఐ కె.జోగమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల నాటుసారాతో పట్టుబడిన ఒక ద్విచక్ర వాహనం, నాలుగు చక్రాల వాహనం ఒకటి వేలం వేస్తున్నామన్నారు. ఆసక్తిగల వారు అదేరోజు రూ.2వేలు దరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

పది మందికి తీవ్ర గాయాలు
ముగ్గురు పరిస్థితి విషమం

ప్రజాశక్తి-డెంకాడ/విజయనగరంకోట

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. పదిమందికి గాయాలయ్యాయి. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఆదివారం ఉదయం మండలంలోని జొన్నాడ వద్ద విజయనగరం - విశాఖ రహదారిపై ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...

మండలంలో బంగార్రాజుపేట గ్రామానికి చెందిన వ్యాను యజమాని మటన్ చేయడానికి 10 మందిని కూలీలను తీసుకుని శనివారం రాత్రి విజయనగరం రూరల్ మండలం లోని గుంకలాం వెళ్లాడు. అక్కడ పనిపూర్తిచేసుకుని ఆదివారం ఉదయం తిరుగు పయనమయ్యారు. జొన్నాడ వద్ద సైకిలిస్టు చందక లక్ష్మణరావు అడ్డురావడంతో ఆయన్ను వ్యాను ఢీకొంది. అంతటితో ఆగక ఆగి ఉన్న కారు వద్ద వేచిఉన్న తురక నవీన్ చందు (34)ను కూడా వ్యాను ఢీకొంది. దీంతో చందు అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం డివైడర్‌ను వ్యాను ఢీకొని బోల్తా పడింది. దీంతో వ్యానులో ప్రయాణిస్తున్న బాడితబోయిన సన్యాసి (58) ఘటనా స్థలంలోనే మృతిచెందాడు.

వ్యానులో ప్రయాణిస్తున్న డి.తాళ్లవలస పంచాయతీ టి.కల్లాలు గ్రామానికి చెందిన వనుము సాయి, వి.తాతారావు, భోగాపురం మండలం పోలిపల్లి గ్రామానికి చెందిన వై.జోగి, భీమిలి మండలం దాకమర్రి గ్రామానికి చెందిన గొప్ప బంగారయ్య, గుంప రామకృష్ణ, గుంప సూర్యరమణ, అక్కివరం గ్రామానికి చెందిన షేక్ శ్రీను, ఎద్దుమట్టి కామరాజు, జామి మండలం ఎం.కొత్తవలసకు చెందిన జి.బంగార్రాజు, బొడ్డవలస గ్రామానికి చెందిన సైకిలిస్టు సంతక లక్ష్మణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికుల సహాయంతో విజయనగరం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వీరిలో తాతారావు, బంగారయ్య, లక్ష్మణరావు పరిస్థితి విషమంగా ఉంది. 8 మంది క్షతగాత్రులను వివిధ ప్రయివేటు ఆస్పత్రుల్లో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చేర్పించారు. మిగిలిన ఇద్దరు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

మృతి చెందిన బాడితిబోయిన సన్యాసిది పూసపాటిరేగ మండలంలోని గుంపాం గ్రామం. ఈయన మటన్ చేయడానికి రోజువారి కూలికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సంఘటన స్థలాన్ని విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

అత్తారింటికి వెళ్లొస్తుండగా..

తురక నవీన్‌చందు స్వస్థలం గుంటూరు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఏడాది క్రితమే వివాహమైంది. పార్వతీపురంలోని అత్తవారింటికి వెళ్లి తిరిగి భార్య సుస్మిత, మరదలతో కలిసి కారులో గుంటూరు వెళుతున్నాడు. ఈ క్రమంలో జొన్నాడ వద్ద టీ దుకాణం వద్ద ఆగారు. తిరిగి కారు దగ్గరకు చందు వస్తుండగా వ్యాను బలంగా ఢీకొంది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.